


## పుట్టెతో పుట్టిన బుద్ధి

'పుట్టెతో పుట్టిన బుద్ధి పుడకలతో గాని పోదని శాస్త్రం'' అన్నది కామమ్మ.

అది మధ్యాహ్నం విరామ సమయం. భోజనాలయాక ఓ కునుకు తీసి లేచి కూచుని, యేమైనా బాగు చేయాల్సినవి వుంటే బాగు చేస్తూ మాట్లాడుకుంటారు, గోష్ఠి జరుపుకునే స్త్రీలు. యేమీ లేకపోతే, పక్కింటి పున్నమ్మ, ఆమె తోడుకోడలు నరసమ్మ, ఆడపడుచు శీతమ్మ వచ్చి కూచుని రసవత్తరంగా గోష్ఠి నడుపుకుంటారు. లోకోక్తులు, చతురోక్తులు, చెణుకులు, శ్లేష, విసుర్లు, నర్మగర్భంగా మాటాడే మాటలు దొర్లుతాయి. వారంతా ప్రపంచం చూసిన అనుభవశాలురు. అనుభవమే పెద్ద డిగ్రీ. షష్టిపూర్తి యేనాడో అయిపోయింది వారికి. అయినా ప్రపంచం మీది అభిమానం, సంతతి మీద తీపీ అలాగే వున్నాయి. అది జీవలక్షణం. వృద్ధు అయినా, శక్తి వుడిగినా, సత్తువ సన్నగిల్లినా తమను గౌరవించే వారూ, ప్రేమించేవారూ లేకపోయినా, చివరికి నిలువనీడలేకపోయినా, యీ మాయా ప్రపంచమే బావుండి, ఆకర్షవంతంగా వుంటుంది. పోవాలని వుండదు. చైతన్యమిచ్చే బతుకులోనే వున్నది ఆనందం.

ఒకరు ఒత్తులు చేస్తుంటే, మరొకరు పత్తి నుండి గింజలు విడదీస్తున్నారు. భమిడి పత్తి జడపత్తి చిన్న అందమైన బుట్టలలో పెట్టి తెచ్చుకున్నారు. ఒకరు పాత బట్టకుడుతుంటే మరొకామె అత్తవార్ని ఆడిపోస్తున్నది. అది ద్వేషంగాదు హాస్యం. అభినయిస్తున్నది గూడాను. కొందరికది హాబీ. వళ్లంతా కదిలించుకుంటూ చేతులూ కళ్లూ తిప్పుతూ యెదుటివారిని ఎంటర్‌టెయిన్ చేస్తారు. మరొకరికి కొంగున డబ్బు వుండాలి లేదా బొడ్డున దోపిన ధోవతి ముడిలో వుండాలి. అవసరానికి తీసి వాడుకోవాలి. ఇటువంటి హాబీలవల్లే కొంతమంది పేరు ప్రఖ్యాతి డబ్బు సంపాయించారు.

రావణునికి పరస్త్రీల నెత్తుకురావటం హాబీ. ఆర్థర్‌కానన్‌డేల్ డాక్టరేకాని నేరపరిశోధక కథలు వ్రాసి షెర్లాక్‌హోమ్స్ అనే వానిని సృష్టించి సర్ బిరుదూ,

కీర్తీ, ధనమూ సంపాయించాడు. మున్షీ ప్రేమ్‌చంద్ టీచరే కాని నవలలు, కథలూ, సాంఘికాచారాలు, స్త్రీల దుస్థితీ వ్రాసి, హిందీ వచన సాహిత్యానికి మూలపురుషుడైనాడు. ఛాప్లిన్ హాస్యగాడే. కాని మనుషులననుకరిస్తూ, పేదల కష్టాలు సినిమాల ద్వారా చూపించటం ఆయన హాబీ అయింది. దాంతోనే ఖండాంతరాలలో గూడా పేరు పొందాడు. ఆ అనుకరణ అనేది తల్లినుండి సంక్రమించింది. కటిక దరిద్రం అనుభవిస్తూ గూడా, దోవనపోయేవారిని అనుకరించి చూపించి తన బిడ్డలకానందం కలిగించి, దరిద్రాన్ని మరిపించేది.

''చాలా శాస్త్రాలొచ్చే నీకూ కామమ్మా. అసలవెట్లా నిలబడి వ్యాప్తిలో కొచ్చాయో!'' అన్నది కమలమ్మ.

''వాటిల్లో సత్యం యిమిడి వున్నది. అందుకని వ్యాప్తిలో కొచ్చాయి'' అన్నది కామమ్మ.

''మరో రెండు చెప్పు విందాము'' అన్నది పున్నమ్మ.

''పుర్రెకో బుద్ధి. జిహ్వాకో రుచి. స్త్రీ చిత్తం, పురుషుడి భాగ్యం. తిరిగే కాలూ తిట్టే నోరూ''.

''అవి నిజమేననిపిస్తుంది. ఇంతమంది అత్తగార్లనూ, కోడళ్లనూ చూస్తున్నామా, రాగతనం చూపటంలో యెవరికివారే సాటి. మా అత్తగారు పుల్లని మామిడి పళ్లు, పుల్లని చల్ల అప్యాయంగా తినేది. కడుపులో కురుపేర్పడుతుందంటే ఖాతరు చేసేదిగాదు. చివరికి యెనభైయ్యోయేట పుండుపుట్టి నయంగానే లేదు. కొడుకూ అంతే పెళ్లిలోనే విందులో లడ్డూలు వడ్డించి తీయని పెరుగు వడ్డిస్తే, ''యివెట్లా తినటం? పెళ్లికొడుకు మొహాన పుల్లనివేం లేవా'' అని చూస్తూ కూచుంటే, మా అమ్మ, కొత్త వూరగాయ నిమ్మ వూరగాయ ముక్కా, పుల్లని చల్లా తెచ్చి వడ్డించింది. అపుడు గబగబా ఆ రెంటి సాయంతో భోజనం పూర్తి చేశాడు పెళ్లికొడుకు. అది చూసి వరసైన వారంతా నవ్వారు విందులో. తల్లి పోలిక అన్నారు'' తానూ నవ్వింది. ''సామెతలు తరవాత వల్లెవేద్దువుగాని కామూ, మొదటి సామెత యెలా వచ్చిందీ చెప్పు.

విందాము'' అనడిగింది సుభద్రమ్మ. సూదిలోకి దారం యెక్కిస్తూ సూది బెజ్జం చూస్తున్నది.

''మన ఫ్రెండు సందడి చేస్తూ వుంటుంది. యాగీ చేయటమంటే యిష్టం. వడ్డీ యిస్తారనగానే డబ్బు అందిస్తుంది, సలహాలు పుంఖం పుంఖంగా వుచితంగా పారేస్తుంది, గొప్పవ్యవహర్త, కోర్టు వ్యవహారాలు కంఠోపాఠం చేసింది, ధనాశలేదనీ, ధనం తృణప్రాయంగా చూస్తానని అరుస్తూ వుంటుందీ'' అని విశేషణాలు చెప్పుకుపోతున్నది కామమ్మ. శ్రోతలు నోటిమీద చెయ్యేసుకుని,

''హయ్యో అదేం దుర్బుద్ధే కనకమ్మకీ? కొత్త యిల్లేగా. అమ్మేస్తుందా? యేం వుపద్రవం వచ్చిందిటా? పాత యిల్లు కొనటం అది అమ్మి మరోటీ కొనటం చూస్తూనే వున్నాంగా'' అన్నారు.

''జై పరమేశ్వరా అని మకాం యెత్తేస్తున్నదా? తల్లో పురుగుతొలుస్తున్నదా? కోడలు కొరివితో రోజూ సంగ్రామమే. దానికా కొత్త యిల్లు చెందకుండా చేయాలనా?'' నోళ్లు వెళ్లబెట్టారు.

''వాటన్నిటి కన్నా మహాపట్నం మీద కన్నుబడింది కనకమ్మకి. చిన్నప్పటినించీ చూస్తూనే వున్నా. భాగ్యవంతులూ, పెద్ద వుద్యోగస్తులూ, పరపతి గల బంధువుల యింట్లో వున్నా, వారి మధ్య ముళ్లలో వున్నా, కనీసం అదే మహాపట్నంలో వున్నా చాలా లాభం గౌరవం వస్తాయని వుద్దేశం''.

''అదెలా? వారంతా గౌరవంగా చూడరే? వుండనిస్తారా?'' మరో మారు వింతపడ్డారు శ్రోతలు.

'' ఒకళ్లుండనిచ్చే దేమి, వచ్చి నెత్తినెక్కుతుంది. చాలా పనిచేసి పెడుతున్నట్టు, ఆదుకున్నట్టు ఆసరాగా వున్నట్టు అభినయిస్తూ మాట్లాడుతూ, అంతలోనే గలభా లేవదీస్తుంది. గొడవ చేస్తుంది. దిద్దుకొస్తున్నానని ప్రచారం చేస్తుంది. వినేవారుంటే తనకెంత అన్యాయం జరిగిందీ చిలవలూ పలవలూ అల్లి రసవత్తరంగా చెప్తుంది. దేశభక్తుడైన పెద్దబావగారెంత అన్యాయం చేసిందీ,

పల్లెలోని పెద్దపెంకుటి భవంతి చౌకగా అమ్మి ''యిది మీ వంతు డబ్బు'' అని తమ్ములకి తలా కాస్తా పంచాడుట. తన్నితేగారెల బుట్టలో పడ్డట్టు పుట్టింటి వారున్న పట్నమొచ్చేసి, ''యిల్లు వూరికేనే వున్నదత్తయ్యా. నేనుంటా. పడిపోతున్నది చూడూ. నేబాగు చేయించి పెడతా. నువ్వు వస్తుపోతూ వుండచ్చు. ఒక్కత్తే కూతురని కూతురి దగ్గర పెద్దపట్నంలో వుంటివి'' అని వూరించి, మొగుడు పిల్లలతో వచ్చి యిల్లు ఆక్రమించింది. మొగుడు పెద్ద వుద్యోగిగాదు. పుట్టింటారూ, దాయాది అన్నదమ్ములూ వుద్యోగస్తులూ బాగ్గెమంతులూను'' అని దీర్ఘం తీసింది కామమ్మ.

తలలాడిస్తూ మూతులు విరుస్తూ వింటున్నామన్నట్టు చూశారు శ్రోతలు.

''అందరి యిళ్లలో దూరి పాయిలా పాయిలాగా వున్నట్టు నటిస్తే, అడ్వొకేట్‌గారి చెల్లెలు, తాసీల్దారుగారి మేనల్లుళ్లు మేనగోడళ్లూ, మున్సిఫ్‌గారి బావమరిదీ అని చెప్పుకుంటారని భావం''.

''కాలం యెల్లప్పుడూ ఒకే మోస్తరుండదే!'' అని సంశయం వెలిబుచ్చింది సుభద్రమ్మ.

''అది నిజమే మరి. అందుకే అల్లుడూ కూతురూ వున్న పట్నానికి మకాం మార్చింది కనకమ్మ. చూసి వస్తూ పోతూ మెజిస్ట్రేట్ గారి అత్తగారు కనకమ్మ కాలం వెళ్లదీసింది''.

''పల్లెలోనూ అత్తారివేపువారు సర్పంచ్, కరణం, మునసబు, పోస్టుమాస్టరూ యస్పై వున్నారే''.

''మొదటి కొచ్చావే? చెప్పాగా. పట్నవాసం. యెవరి మధ్య వుండాలీ? పల్లెనిండా పల్లెటూరి గబ్బిలాలేనుట'' అన్నది కనకమ్మ.

''పల్లెలు పనికిరావా? పొలాలుంటాయే? వాటిమీద ఫలసాయం వస్తుంది''.

''అది వేరే సంగతి. ఐవేజు సేకరించి తెచ్చుకోటానికే పల్లెకు ప్రయాణం కట్టి మళ్లా రివ్వున డబ్బు మూటతో పట్నం వచ్చేస్తుంది. పొలాలకి మంచి మంచి ధరలు పలుకుతున్నాయని వినగానే పరుగెత్తుకెళ్లి వాటినమ్మి డబ్బు మూటతో పట్నం నవ్వుతూ వచ్చేస్తుంది''.

''భస్తున్నా కామూ. ఐవేజు కోసం వెళ్తే పన్లు త్వరగా కావైపాయె. సత్రంలో మకాం పెట్టాలి. సత్రం గదిలో వుడకేసుకోవాలి. సత్రం గుమాస్తా అన్నీ సప్లై చేస్తాడనుకో'' అని నవ్వుతుంది. ''అక్కడ వడ్డీ వ్యాపారం సాగితే వుంటుందేమో'' అని సుభద్రమ్మ కమలమ్మ నవ్వారు.

''బాగా చెప్పారు. వుపదేశం పొందేవారూ, కోర్టు వ్యవహారాలలో సలహా పొందేవారూ గూడా వుండాలేమో''.

''అప్పుడే వచ్చేశావే కనకమ్మా. వెళ్లిన పని అయిందీ?'' అనడిగితే, ''కుప్పలు కొట్టించి, కల్లంలోనే ధాన్యమమ్మించి డబ్బు చేశానా, అంత డబ్బున్నదనగానే కాపువేసి బుర్రబద్దలు కొడతారు. నా పింతల్లి అల్లునితోడు రమ్మని ఫలసాయం తెచ్చుకోటానికెళ్లింది. ఇంకా ధాన్యం అమ్మనే లేదు. పిన్ని వంటిమీదున్న బంగారం కోసం యింటికప్పు పీకి లోపలికి దూకి చంపేశారు. అల్లుడు చాటున వుండి చూశాడు. యెదుటబడితే తననూ చంపుతారని భయపడి, తానే హత్య చేశాడంటారని భయపడి పారిపోయాడు'' అని హేళనగా వెగటు పుట్టేట్టు నవ్వింది కనకమ్మ.

''ఇది పట్నమేనంటారే. జనాభా పెరిగింది. వాహనాలు రద్దీ యెక్కువైంది. సిటీ బస్సులు యెక్కువైనై''.

''ఇది పట్నం కాదుట కోడలు యింటిగుట్టు బైటపెడుతున్నది. కొడుకు బాంక్‌స్కామ్‌లో యిరుక్కుని బర్తరఫ్ అయినాడు. మనమడు తేతే అని ఆ చదువుకి అంతులేదుట''.

''మహామహా వారికోడళ్లే అలా చేస్తుంటే మనమనగా యెంత? డబ్బు

రాల్తుందని తెలియగానే, గౌరవమర్యాదలకి తిలోదకాలు. తక్కినవాటికీ రెడీ. నేరాలలోకి నడవటానికీ వెరపు లేకుండా పోయింది. ఫోర్జరీ చేయటానికి పాపభీతి లేదు. ఈమె పైనించి వూడిపడిందా? సిటీలో యేంచేస్తుందట. అక్కడెవరైనా వున్నారా?''

''రెడ్డొచ్చె మొదలాడమని మళ్లా మొదటికొచ్చావే? కూతురూ అల్లుడూ వున్నారు. వ్యాపారం, షేర్లూ, పిల్లల చదువులూ, వుద్యోగాలూ, విదేశాలు గూడా వెళ్తున్నారు''.

''అహహా!'' అని నవ్వింది కమలమ్మ. ''కనకమ్మ విదేశం వెళ్తుందిటనా?''

''యేం యెందుకు వెళ్లలేదూ?''

''యేం చేస్తుందిట అక్కడ?''

''మిషన్, ఆశ్రమం, నడుపుతుందిట. దివ్యజ్ఞానం కలిగిస్తుందిట. యోగా క్లాసెస్ తీసుకుంటుందిట. గ్రాంట్సు తెస్తుందిట''.

'' ఇంకా నయం సినిమాలు తీయదూ?''

''అవీ తీయిస్తుందిట''

'పెట్టుబడి కావద్దూ?''

''చెప్పాగా పరపతిగల అల్లుడూ, కూతురూ, మనమలూ, మనుమరాళ్ళూ వున్నారని. వారి పరపతీ, యిన్ఫ్లుయన్సూ వాడుకుంటుందిట''.

''అవన్నీ చేయగల సమర్ధురాలే అనుకున్నా ముందు యిల్లొకటి చూడద్దూ? 'వాళ్లింట్లోనే యోగా క్లాసెస్ తీసుకుంటుందా కనకమ్మ? మరీ విచిత్రం!'' అని తల తాటించి నోరునొక్కుకున్నది సుభద్రమ్మ.

''కూతురికీ అల్లుడికీ వుత్తరం వ్రాసేసిందిట. సెపరేట్‌గా ఒక యిల్లు ఒక లక్షకి బేరం చేసి సెటిల్ చేస్తే డబ్బు మూటకట్టుకుని వచ్చేస్తుందిట. అన్ని వసతులు వుండవలెను. పనిమనిషి, వంటమనిషి ఒక నౌకరు సిద్ధం చేయమని వ్రాసేసిందిట''.

''మరి కొడుకేమౌతాడు?''

''వాడినీ తీసికెళ్తుందిట. మగదిక్కు కావద్దా! వాడు ఒక పత్రిక స్థాపించి నడుపుతాడుట. ముద్రణాయంత్రం కొని ఆ యింట్లోనే పత్రికా ప్రచురణ. ప్రకటనలు యిచ్చేవారిని యెన్నిక చేసి వుంచమని వ్రాసేశారుట''.

''యేదైనా పార్టీలో చేరితే అవన్నీ నెరవేరుతాయేమోఅల్లుని ఒక్కని వల్లా అవన్నీ కావేమో''.

''కనకమ్మ సంగతి నీకు తెలియదా? పవర్లో వున్న పార్టీలో చేరుతుంది. ప్రాణం మీదికి తెచ్చే పార్టీలో చేరదు''.

''వాళ్లు చేర్చుకోవద్దూ?''

''అరచేతిలో వైకుంఠం చూపిస్తుంది''.

'' ఎన్నికలల్లో నిలబడుతుందిట గూడానా? మధ్యంతర యెన్నికలు వస్తూనే వుంటాయి'' అని నవ్వింది నాంచారమ్మ.

'' ఓట్లు వేయిస్తాము. గెలిపిస్తాము అని మాటిస్తే, తప్పకుండా ఎన్నికల్లో పాల్గొంటుంది''.

''ధరావతు కట్టద్దూ? టికెట్ లభ్యం కావద్దూ? మనిఫెస్టో చదవటం రావాలేమో''.

''యెవరు టికెట్ తేగలరో వారే ధరావతు డబ్బూ కనకమ్మ చేతులో పెట్టాలి. మానిఫెస్టో భయం లేదు. చెప్పాగా అరచేతిలో వైకుంఠం చూపిస్తుందనీ''.

'' మరో సిటీ యెన్నుకోదూ? అల్లుడున్న సిటీయే యెందుకు? మనకు మహానగరాలు ఆరుపైనే వున్నాయే!''.

''సామెతతో మొదలుపెట్టాం గోష్ఠి. పుట్టితో పుట్టిన బుద్ధి పుడకలతోగాని పోదని. తల్లి గర్భంలో పిండం యేర్పడేప్పుడే, పాసివ్‌గా వున్నప్పుడే, ముందు చిన్న పుట్టె యేర్పడుతుంది. దానికి తోకలాగా తక్కిన రూపం యేర్పడుతుంది. తరవాత రూపం బాగా వికసిస్తూ అవయవాలేర్పడతాయి. ఆ పుట్టె యేర్పడినప్పుడే

దానిలో ఆ జీవి బుద్ధి అంటే అలవాటు గూడా చుక్కలాగా యేర్పడి వుంటుంది. అదీ వికసిస్తుంది. అదే మొదటి నించీ వున్న బుద్ధి లేదా అలవాటు'' అని నవ్వింది కామమ్మ.

గోష్ఠి ముగిసింది. శ్రోతలంతా నవ్వుతూ లేచారు. మొదలుపెట్టిన పన్లు అయిపోయాయి. గృహకృత్యాలలో పాల్గొనాలి.